క్లుప్తంగా

విరువూరులో హెల్త్‌మేళా



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

పొదలకూరు : మండలంలోని విరువూరు ప్రగతినగర్ పాఠశాలలో ఆయుష్మాన్‌భవ ఆయుర్వేద హెల్త్ మేళాను డాక్టర్ వినోద్ బాబు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా షుగర్, బీపీ, పక్షవాతం, ఆయాసం వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో చెలరేగిన మంటలు

- రూ.6 లక్షలు ఆస్తి నష్టం



ఇంట్లో నుంచి బయటకు వస్తున్న పొగలు

నెల్లూరు(క్రైమ్): ఏసీలో షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకుని ఇంట్లో మంటలు చెలరేగడంతో రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటన బీవీనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు..బీవీనగర్‌కు చెందిన బీ గోవర్ధన్ స్టీల్, సిమెంట్ వ్యాపారి. ఆయనకు మూడంతస్థుల భవనం ఉంది. గ్రౌండ్‌ఫ్లోర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఫస్ట్‌ఫ్లోర్ ప్రాబోస్ ఇన్సూరెన్స్ కంపెనీకి అద్దెకు ఇచ్చాడు. రెండో, మూడో ఫ్లోర్‌లలోని డూప్లెక్స్ హౌస్‌లో ఆయన తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. శనివారం పట్టపగలు బెడ్‌రూమ్‌లోని ఏసీలో విద్యుత్‌వైర్లు షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లోని వారు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు యత్నించారు. అప్పటికే ఇంట్లో దట్టమైన పొగ కమ్ముకోవడంతో రోప్ సాయంతో బిల్డింగ్‌పై నుంచి ఇంట్లోకి ప్రవేశించి మంటలను అదుపుచేశారు. మూడు ఫైర్‌ఇంజిన్లు గంటపాటు శ్రమించాయి. సకాలంలో మంటలను ఆర్పివేయడంతో గ్రౌండ్,ఫస్ట్ ఫ్లోర్‌లోని కార్యాలయాలకు మంటలు వ్యాపించలేదు. దీంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

న్యాయమూర్తులను కలిసిన ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జయసూర్య, జస్టిస్ సుబ్బారెడ్డిని నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలను అందజేశారు.

4న సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

నెల్లూరు (టౌన్): వర్మికంపోస్ట్ తయారీ, నిర్వహణ అనే అంశమై నగరంలోని డీకే డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సును వృక్షశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో ఈ నెల నాలుగున ప్రారంభించనున్నామని ప్రిన్సిపల్ గిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్మికంపోస్ట్‌ను తయారు చేయడంలో నైపుణ్యం, మార్కెటింగ్ చేయడంలో శిక్షణను ఇవ్వనున్నామని చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌ను అందజేయనున్నామని పేర్కొన్నారు. పది, ఇంటర్ చదివిన వారు, ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 93924 87705, 93989 00217 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డాక్టరేట్ ప్రదానం



గాయత్రి

నెల్లూరు (టౌన్): వీఎస్‌యూలో బయో టెక్నాలజీలో పీహెచ్‌డీ చేసిన గాయత్రికి డాక్టరేట్ లభించింది. వీఎస్‌యూ బయోటెక్నాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్మయి పర్యవేక్షణలో పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ఈ క్రమంలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కాగా గాయత్రిని పలువురు అభినందించారు.

8న ఓపెన్ చెస్ టోర్నీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): స్టోన్‌హౌస్‌పేటలోని మై డ్రీమ్స్ క్లబ్ స్టేడియంలో ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నీని అక్టోబర్ 8న డాట్స్ లింక్స్, ఆర్‌ఎల్, ఎస్వీ చెస్ అకాడమీల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలోని నుడా చైర్మన్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రూ.52 వేల నగదు బహుమతులతో పోటీలను నిర్వహించనున్నారని తెలిపారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, రామ్‌లక్ష్మణ్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

- డీపీఓ సుస్మితారెడ్డి
- గ్రామాల్లో విజయవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష



మనుబోలు : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సుస్మితారెడ్డి

మనుబోలు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని డీపీఓ సుస్మితారెడ్డి అన్నారు. మండలంలోని వెంకన్నపాళెంలో శనివారం జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య శిబిరాలను సిబ్బంది బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఈ శిబిరానికి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వైద్య శిబిరంలో చిన్న పిల్లల వైద్యుడు టి.వెంకటేశ్వర్లు, జనరల్ ఫిజిషియన్ లక్ష్మీనారాయణ, డాక్టర్లు ఆమని, గేయపూజిత, సుబ్బరాజు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ శిబిరంలో 185 మంది రోగులను పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎంపీడీఓ ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. ఎంపీపీ వజ్రమ్మ, సర్పంచ్ పెంచలమ్మ, ఏఓ రవికుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ముత్తుకూరు : పేదల ఆరోగ్యం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎంపీపీ గండవరం సుగుణ అన్నారు. మండలంలోని పంటపాళెం సచివాలయంలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు మాట్లాడుతూ, పేదల కోసం ఇప్పటికే 104, 108, ఆరోగ్యశ్రీ తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ నంగా చెంగారెడ్డి తదితరులు ప్రసంగించారు. సర్వేపల్లి స్పెషల్ ఆఫీసర్ ఓబులేసు, వైద్యనిపుణులు వినీల, కృష్ణచైతన్య, హీరా, చందనప్రియ తదితరులు పాల్గొని, వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 906 ఇళ్లకు గానూ 824 ఇళ్లలో వైద్య సిబ్బంది సర్వే చేసింది. 159 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పేదల ముంగిటకే వైద్యసేవలు

వెంకటాచలం : పేదల ముంగిటకే ఉచిత వైద్య సేవలందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. మండలంలోని పాలిచెర్లపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్పెషలిస్ట్ వైద్యులతో రోగులకు పరీక్షలు జరిపారు. అనంతరం మందల వెంకటశేషయ్య మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించారని గుర్తుచేశారు. ఆ తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యం గురించి ఆలోచించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే ఖరీదైన వైద్యాన్ని అందిస్తున్నట్లు కొనియాడారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందా కవిత, ఎంపీడీఓ వెంకటరమేష్, కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణులు పవిత్ర, ప్రవళిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల వైద్యానికి పెద్దపీట

తోటపల్లిగూడూరు : రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు అన్నారు. ఇస్కపాళెం సచివాలయ పరిధిలోని ఇస్కపాళెం, పాపిరెడ్డిపాళెం, కోవెరపాళెం గ్రామాలకు సంబంధించి తోటపల్లిగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు శనివారం జరిగింది. దాదాపు 390 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని, పేద ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ మాట్లాడుతూ నాడు దివంగత వైఎస్సార్ పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తే, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, ఎంపీడీఓ హేమలత, తహసీల్దార్ లావణ్య, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు రాయపు శీనయ్య, సర్పంచ్ ఇంగిలాల చైతన్య, స్థానిక నేతలు తిరువళ్లూరు ఈశ్వరయ్య, తాని తిరుపతి, ఎంబేటి సంధ్యారాణి, కదురు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు స్పెషలిస్ట్ డాక్టర్లు

ఇందుకూరుపేట : గ్రామీణ ప్రాంతాలకు స్పెషలిస్ట్ డాక్టర్లు వచ్చి వైద్యసేవలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఇలాంటివి దేశ చరిత్రలో ఎన్నడూ జరగలేదని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని డేవిస్‌పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఇందులో భాగంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ కె.నాగేంద్రకుమార్, ఈఓపీఆర్డీ వసుంధర, సీడీపీఓ రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం) : ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జేసీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. మండలంలోని పంచేడులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జేసీ శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ప్రభుత్వం అందజేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధీర్‌కుమార్, వైద్యులు, వైద్యారోగ్య సిబ్బంది ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు : జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. మండలంలోని మోడేగుంట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో 15 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి 105 రకాల మందులను అందిస్తారన్నారు. ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహులురెడ్డి, తహసీల్దార్ పద్మజ, సర్పంచ్ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

విడవలూరులో..

విడవలూరు మండలంలోని చౌకచర్లలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నవీన్ కుమార్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఓగు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణకే..

కొడవలూరు : ప్రజారోగ్య రక్షణ కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని దామేగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే ఎందులోనైనా రాణించగలుగుతారని, ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. అనంతరం ప్రత్యేక వైద్య నిపుణుల బృందం భారీ సంఖ్యలో వచ్చిన ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. అనంతరం మందులు ఇవ్వడంతో పాటు పలువురికి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తీసుకుపోయేలా చర్యలు తీసుకున్నారు. వైద్య సేవలందించిన వారిలో ఎముకులు, కీళ్ల వైద్య నిపుణుడు నిఖిల్, కంటి వైద్య నిపుణురాలు కీర్తిక, కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు, యల్లాయపాళెం వైద్యాధికారి లత ఉన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ డేవిడ్, వైఎస్సార్‌సీపీ నేతలు చిమటా శేషగిరి, కొట్టే మల్లికార్జున, మందపల్లి మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు టి.సురేష్, అంకమరాణి తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



విడవలూరులో మాట్లాడుతున్న అచ్యుత్‌రెడ్డి



కోవూరు : మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి



వెంకటాచలం : మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య



ముత్తుకూరు : మందులను అందజేస్తున్న స్పెషల్ కలెక్టర్ ఓబులేసు



ముత్తుకూరు : మాట్లాడుతున్న ఎంపీపీ సుగుణమ్మ



తోటపల్లిగూడూరు : ఇస్కపాళెంలో ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నేతలు



ఇందుకూరుపేట : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పారిశుద్ధ్య కార్మికుల రుణం తీర్చుకోలేనిది



క్లాప్ మిత్రలతో కలిసి కాఫీ తాగుతున్న డీపీఓ సుస్మితారెడ్డి

- డీపీఓ సుస్మితారెడ్డి

మనుబోలు : మనం ఏమిచ్చినా పారిశుద్ధ్య కార్మికుల రుణం తీర్చుకోలేమని జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో జరిగిన కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను పరమశివునితో పోల్చారు. పారిశుద్ధ్య కార్మికులే లేకుంటే మన జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో ఊహించుకోలేమన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి వారు పనిచేశారని కొనియాడారు. ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చెత్త తరలించేందుకు సరిపడా వాహనాలు ఇవ్వాలని కోరారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, సర్పంచ్ పద్మమ్మ, ఈఓపీఆర్డీ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నేతలు చిట్టమూరు అజయ్‌కుమార్‌రెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, గుంజి రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న మెప్మా సిబ్బంది

కోవూరు (బుచ్చిరెడ్డిపాలెం) : పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబానికి అండగా నిలవాలని మెప్మా సీఈఓ నర్మదా కోరారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఇస్కపాళెం సమైక్య సర్వ సభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజా మురళి, ఏపీఎం లలితతో కలిసి నర్మదా హాజరై మాట్లాడారు. ఇస్కపాళెం సమైఖ్యలో మొత్తం 30 సంఘాలు ఉన్నాయని, ఆయా సంఘాల్లో ఉన్నవారు పొదుపు రుణాలను వృథా చేయకుండా వ్యాపారం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బద్దెవోలు విద్యార్థులు



పీడీతో స్నేహలత, భావ్య

మనుబోలు : జిల్లాస్థాయి ఆటల పోటీల్లో రాణించిన బద్దెవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం చందన శనివారం తెలిపారు. బద్దెవోలు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పి.వెంకటస్నేహలత, పదో తరగతి చదువుతున్న ఎం.భావ్య స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మెరుగైన ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. అలాగే యోగా పోటీల్లో పదో తరగతి విద్యార్థి ఎస్కే సాధిక్ కూడా రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలియజేశారు. వీరిని హెచ్ఎం చందన, పీడీ మధుసూదన్ గ్రామస్తులు అభినందించారు.

వైభవంగా గణపతి హోమం

మనుబోలు : చవితి ఉత్సవాల్లో భాగంగా మనుబోలులోని వినాయక ఆలయం వద్ద మహాగణపతి హోమాన్ని శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద గత 13 రోజులుగా ఘనంగా పూజలు చేస్తున్నారు. అర్చకుడు సాయిశర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయం వద్ద మంత్రోచ్చారల మధ్య మహాగణపతి హోమాన్ని జరిపించారు. ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉభయకర్తలుగా గూడూరు పెంచలయ్య-జ్యోతి దంపతులు, వారు కుమారులు వ్యవహరించారు.

స్పీకర్‌కు స్వాగతం



నెల్లూరు(దర్గామిట్ట) : తిరుమలలో శ్రీవారి దర్శనానికి వెళ్తూ నెల్లూరు నగరానికి విశ్రాంతి నిమిత్తం వచ్చిన శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్‌ను కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.

బ్యాంక్ అభివృద్ధే లక్ష్యం



రైతులకు డివిడెండ్ నగదును అందజేస్తున్న బ్యాంక్ చైర్మన్

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ అభివృద్ధే లక్ష్యంగా డైరెక్టర్లు, సిబ్బంది ముందుకు సాగుతున్నారని ఆ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆ బ్యాంక్ ఆవరణలో మహాజన సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ మాట్లాడుతూ 2022-23కు సంబంధించి బ్యాంక్ వార్షిక ఆదాయం రూ.46.47 లక్షలు అని, వచ్చిన ఆదాయంలో 10 శాతం చొప్పున 5,600 మంది రైతులకు రూ.5.60 లక్షలను డివిడెండ్ ఫండ్‌గా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సంగం వెంకయ్య, చిట్టిబోయిన కృష్ణ ప్రసాద్, సీఈఓ మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో న్యాయమూర్తులు



సత్కారం అందుకున్న న్యాయమూర్తులు

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం) : ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నినాల జయసూర్య, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి కుటుంబంతో కలిసి మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో స్వామి, అమ్మవార్లను శనివారం ఉదయం దర్శించుకున్నారు. తొలుత దేవస్థానం చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ గిరికృష్ణ న్యాయమూర్తులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీగణపతి స్వామి, మల్లికార్జునస్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం వారిని శేషవస్త్రాలతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు. వారి వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, ప్రోటోకాల్ న్యాయమూర్తి కేపీ సాయిరాం ఉన్నారు.

ఆలయాల్లో చోరీకి యత్నం

వెంకటాచలం : మండలంలోని కసుమూరు పంచాయతీ చింతలపాళెం గ్రామంలో ఉన్న మాతమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. శనివారం ఉదయం గ్రామస్తులు మాతమ్మ ఆలయానికి చేరుకోగా తలుపునకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే ఆలయంలో ఎలాంటి వస్తువుల అపహరణ జరగలేదని తెలియడంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రిజర్వాయర్ వద్ద శివాలయంలో..

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం) : మండల పరిధిలోని కనిగిరి రిజర్వాయర్ వద్ద ఉన్న శివాలయంలో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు. శివాలయ తలుపునకు ఉన్న తాళం పగులగొట్టి ఉందని, అయితే ఆలయంలోని బీరువాను ఏమీ చేయలేదని, స్వామివారి వెండి ఆభరణాలు కూడా ఉన్నాయని స్థానికులు తెలిపారు. అయితే సీసీ కెమెరాకు సంబంధించిన మానిటర్లను అపహరించారని, ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.